ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

బుధవారం 29 జనవరి 2025

నేడు ప్రతాప్‌సింగారానికి మంత్రుల రాక

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాప్‌సింగారం జిల్లా పరిషత్ పాఠశాలలో నేడు(బుధవారం) జరుగనున్న వార్షికోత్సవానికి ముఖ్య అతిథిలుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, సీతక్క, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ ఈటల హాజరుకానున్నట్లు హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. ఇప్పటికే అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు, ఉపాధ్యాయులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వసతి గృహాల్లో మరమ్మతులు పూర్తి

» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ అధికారులు, వసతిగృహాల వార్డెన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని చోట్ల మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతీ హాస్టల్‌లో చేసిన మరమ్మతులకు ముందు, తర్వాత ఫొటోలు పీపీటీ ద్వారా పరిశీలించారు. పనులకు సంబంధించిన ప్రతీ హాస్టల్ రూఫ్ లీకేజ్, టాయిలెట్స్, రన్నింగ్, వాటర్, కిటికీలు, తలుపులు, తాగునీటికి ఆర్‌వో ప్లాంట్స్ అన్ని మౌలిక సదుపాయల ఏర్పాట్లపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా మిగిలిపోయిన పనులకు నిధులు మంజూరు చేసేందుకు అధికారులు ప్రాక్టీస్ చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి మల్లేశం, బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్లు మాధవరెడ్డి, శ్రీనివాస్, నాగభూషణం, ఎస్సీ, బీసీ, గిరిజన వసతిగృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల పురోగతిపై ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలని, పోలీస్ అధికారులందరూ రోడ్డు ఆక్సిడెంట్లు, ఆత్మహత్యలు జరుగుటకు కారణాలు తెలుసుకొని వాటిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక, గుట్కా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాను అరికట్టాలలన్నారు. అలాగే ప్రజలకు సీసీ టీవీలపైన అవగాహన కల్పించాలని తెలిపారు. వీకెండ్‌లలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ బుకింగ్, వెహికిల్ చెకింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్ పైన దృష్టి పెట్టాలని కేసుల కన్విక్షన్ శాతాన్ని పెంచాలన్నారు. మహిళా సంబంధించిన కేసులకు పాల్పడే నేరస్థులపైనా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

రకరకాల వనమూలికలు

వికారాబాద్‌కు ఓ ప్రత్యేకత ఉంది. అక్కడున్న అటవీ ప్రాంతంలో ఉష్ణోగ్రత సాధారణం కన్న 2, 3 శాతం తక్కువగా ఉంటుంది. నిజాం పాలకులు ఆ ప్రాంతంలో అనేక ఔషధ మొక్కలు నాటారు. దీనికి తోడు రకరకాల వనమూలికలు ఉన్నాయి. టీబీ వచ్చిన వారిని రెండు నెలలు ఆ ప్రాంతంలో ఉంచితే మందులు లేకుండా జబ్బు నయమవుతుందంటే అతిశయోక్తి కాదు.

-ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఎక్స్‌పీరియం పార్కులోని ఓ ప్రదేశం

ఎకో టూరిజం హబ్‌గా వికారాబాద్

ఎక్స్‌పీరియం ఎకో పార్కు ఏర్పాటు అభినందనీయం

హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి

పార్కు అధినేత రామ్‌దేవ్‌ను ప్రశంసించిన సీఎం

వనజీవి రామయ్య దంపతులకు రూ.50 వేల చెక్కు అందజేత

'ఎక్స్‌పీరియం' ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి జూపల్లి, మహేందర్‌రెడ్డి, చిరంజీవి

రంగారెడ్డి అర్బన్/శంకర్‌పల్లి/చేవెళ్ల/మొయినాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే పూర్తి స్థాయిలో వికారాబాద్ ప్రాంతాన్ని ఎకో టూరిజంగా అభివృద్ధి చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. చేవెళ్ల నియోజకవర్గం పొద్దుటూరులో మంగళవారం ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎక్స్‌పీరియం పార్కు అధినేత రామ్‌దేవ్ ముఖ్యమంత్రికి పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రితో పాటుగా చిరంజీవి, మంత్రి జూపల్లి కృష్ణారావులను ఎలక్ట్రికల్ వాహనంలో తిప్పుతూ పార్కులో కొంత ప్రాంతాన్ని చూపించారు. వృక్షాల మధ్య ఆహ్లాద వాతావరణంలో

మిగతా 7వ పేజీలో...

రోడ్లు బాగు చేయాలి: ఎమ్మెల్యే యాదయ్య



లండన్, ప్యారిస్ కాదు మన హైదరాబాద్‌కు వన్నె తెచ్చేలా ఎక్స్‌పీరియం పార్కు ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. దేశంలోనే ఈ ప్రాంతాన్ని నంబర్ వన్‌గా చేస్తున్నందుకు చైర్మన్ రామడగు రామ్‌దేవ్ రావును అభినందిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న చేవెళ్ల నియోజకవర్గం రానున్న రాజుల్లో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో రోడ్లు బాగా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాగే చిల్కూరు నుంచి ఎన్కేపల్లి, వికారాబాద్ వెళ్లే రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందని ఈ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు వేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాబోయే కాలంలో చాలా మంది పర్యాటకులు పార్కుకు వచ్చే అవకాశం ఉన్నందున ఈ రోడ్డుకు విస్తరించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

అనంతగిరి.. పర్యాటక సిరి

అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు

స్వదేశీ దర్శన్ 2.0 కింద ఎంపిక » ఇప్పటికే 213 ఎకరాల్లో సర్వే పూర్తి

తొలిదశలో రూ.38 కోట్లు కేటాయింపు » దావోస్‌లో వెయ్యి కోట్లతో ఓ సంస్థతో ఒప్పందం

పొద్దుటూరు సభలో సీఎం రేవంత్‌రెడ్డి నోట అనంతగిరి పర్యాటకం మాట



అనంతగిరిలో వ్యూ పాయింట్ స్పాట్

వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలను పర్యావరణ పర్యాటక (ఎకో టూరిజం) కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. రెండు దశాబ్దాల ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అనంతగిరి కొండల్లో టూరిజంను అభివృద్ధి పరిచేందుకు 213 ఎకరాలను రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(టీజీటీడీసీ)కు అప్పగించారు. జోన్-1లో 177 ఎకరాలు, జోన్-2లో 36 ఎకరాలను కేటాయిస్తూ విభజించారు. దీంట్లో 50.05 ఎకరాలను ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా కేటాయించారు.

స్వదేశీ దర్శన్ కింద ఎంపిక

కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద అనంతగిరిని ఎంపిక చేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.158 కోట్లు మంజూరు చేసింది. మూడు దశల్లో పనులు చేపట్టాలని ప్రతిపాదించగా, డీపీఆర్ ప్రకారం మొదటి విడతలో రూ.38 కోట్లతో

మిగతా 7వ పేజీలో...

వాహనాన్ని మొబైల్ నంబర్‌కు

లింక్ చేయాలి

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి



వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ వాహనాన్ని వారి మొబైల్ నంబర్‌తో లింక్ చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లింక్ చేయడంతో లైసెన్స్ రెన్యువల్, ఫిట్‌నెస్, రెన్యూవల్, టాక్స్ పేమెంట్స్ తదితర సమాచారం మొబైల్ ఫోన్ అలార్ట్‌గా పొందవచ్చన్నారు. జిల్లాలో సుమారు 5,000లకు పైగా వాహనాల పన్ను బకాయిలు సుమారు రూ.2 కోట్లు ఉన్నాయని పేర్కొన్నారు. జనవరి 21లోపు మీ సేవలో లేదా ఆన్‌లైన్‌లో బకాయిలు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9848528441 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



స్కూల్‌లో వండిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని కలెక్టర్ గౌతమ్ ఉపాధ్యాయులకు ఆదేశించారు. మంగళవారం శ్రీరంగవరం, నూతన్ కల్ గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీరంగవరంలఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పశువైద్యశాలను తనిఖీ చేశారు. అనంతరం నూతన్‌కల్ పల్లె దవాఖానను సందర్శించారు. అంతకు ముందు శ్రీరంగవరంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విదంగా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మంచి భోజనం అందిచాలన్నారు. అనంతరం అక్కడే ఉన్న పశువుల ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవల గురించి ఆరా తీశారు. నూతన్‌కల్ గ్రామంలో పల్లె దవాఖానాలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయనతో పాటు డీఈఓ విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి రఘునాథ స్వామి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత, తహసీల్దార్ శైలజ, ఎంపీడీఓ వసంత లక్ష్మీ, జడ్పీ సీఈఓ కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రాక్టికల్ పరీక్షలు

ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్

వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ అన్నారు. వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనరల్‌లో 38, ఒకేషనల్‌లో 10 ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జనరల్ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 3,782 మంది సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 797 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,336 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఈ నెల 29న, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష 30న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్షలు జనవరి 31న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1న, సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్, ప్రాక్టికల్ టైమ్ టేబుల్ వారు చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్ దగ్గర నుంచి తీసుకోవాలన్నారు. పరీక్ష సమయానికి కనీసం ఒక గంట ముందు కేంద్రానికి చేరుకునేలా విద్యార్థులు ప్లాన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్

విడతల వారీగా పథకాలన్నీ అమలు

» త్వరలో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం

» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్

కోట్‌పల్లి/బంట్వారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం కూడా ఇస్తామని, విడతల వారీగా అన్ని పథకాలన్నీ అమలు చేస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బుగ్గాపురంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, దీపం పథకానికి సంబంధించి బాండ్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్ అన్సారి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు నరసింహారెడ్డి, రామ్‌చందర్ రెడ్డి, రమేశ్‌నాయక్, నరసింహారెడ్డి, బందయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శశికాంత్, అశోక్ పాల్గొన్నారు.

బంట్వారం అభివృద్ధికి కృషి

బంట్వారం మండలాభివృద్ధికి కృషి చేస్తానని ప్రసాద్ కుమార్ అన్నారు. బంట్వారంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రొంపల్లి, తొర్మామిడి, బోపునారంలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండలానికి భారీగా నిధులు మంజూరు చేశామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. .అనంతరం 71 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాద్‌ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల

నివారణకు కృషి

అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రమాదాలను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్లు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించడం కోసం రోడ్డు భద్రతామాసోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధికాగుప్తా

జక్కేపల్లి శివారులో చిరుతపులి కలకలం!

యాలాల, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కేపల్లి శివారు లో చిరుత సంచరిస్తుందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు అమృతప్ప, గురువేష్ మంగళవారం ఉదయం పొలానికి వెళ్లగా చిరుతపులిని గమనించామని పోలీసు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి చిరుతపులివి కావని, వేరే అడవి జంతువులు అయి ఉండొచ్చన్నారు. గ్రామస్తులు భయాందోళనకు గురికావద్దని యాలాల ఎస్ఐ గిరి, ఫారెస్ట్ ఆఫీసర్ సూచించారు.

'హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఖర్గే వ్యాఖ్యలు'

షాద్‌నగర్ అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గంగలో మునక వేస్తే దారిద్ర్యం పోతుందా అంటూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపనీయమని, కుంభమేళా ను దృష్టిలో పెట్టుకుని హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష స్థానంలో ఉన్న ఖర్గే హిందువుల సంస్కృతి, సంప్రదాయాలను కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మొదటి నుంచి సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తూ, అవమాన పరుస్తూ మాట్లాడడం సరికాదని తెలిపారు. హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. త్వరలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని శ్రీవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ వాసు

షాద్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఎంవీఐ వాసు అన్నారు. విద్యార్థుల మేధస్సును పెంచేందుకు వ్యాసరచన పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపులో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంవీఐ వాసు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉషలు కలిసి మంగళవారం బహుమతులు అందజేశారు. షాద్‌నగర్ డిపోలో ఉత్తమ డ్రైవర్లు లక్ష్మయ్య, రవిందర్, రాములులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రవీందర్‌యాదవ్

దోమ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా టీబీ అధికారి రవీందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెలివరీరూమ్, ఫార్మసీరూమ్, ల్యాబ్‌రూమ్‌లను తనిఖీచేసి సంతృప్తి వ్యక్తంచేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. ప్రతీ నెలలో 10నుంచి 20వరకు కచ్చితంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు



తాండూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో 'చిమ్మచీకట్లు వీధి దీపాలు ఏర్పాటులో విఫలం' అనే శీర్షికన ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ అధికారులు వీధి దీపాలు లేని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ప్రధానంగా డాగ్ బంగ్లా రోడ్డు మార్గంలో ఆరు స్తంభాలపై లైట్లను ఏర్పాటు చేశారు.

పల్లె రహదారులకు మహర్దశ

- ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్
- 17 రోడ్లకు ఎంఆర్ఆర్ గ్రాంటు

రూ.15.20 కోట్లు మంజూరు

తాండూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలోని పల్లె రహదారులకు మంచి రోజులు వచ్చాయి. నియోజకవర్గ కేంద్రానికి లింకుగా ఉన్న రోడ్లతో పాటు అధ్వాన్న స్థితిలో ఉన్న రహదారులకు ఆర్థికశాఖ పనులు చేపట్టేందుకు ఆమోదం తెలుపుతూ జీవో నంబర్-59ను జారీచేసింది. నియోజకవర్గంలోని 17రోడ్లకు ఎంఆర్ఆర్ గ్రాంటు కింద రూ.15కోట్ల 20లక్షలు మంజూరు కోసం ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. జిన్‌గుర్తి నుంచి సంకిరెడ్డిపల్లి, రహదారికి రూ.కోటి, సంకిరెడ్డిపల్లి నుంచి దారనివాగు తండా రోడ్డుకు రూ.50లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రాంపూర్ వరకు రూ.41లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోనూర్ వరకు రూ.71లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బిజ్వార్ వరకు రూ.61లక్షలు, పెద్దేముల్ నుంచి పెద్దేముల్ తండా రహదారికి రూ.20లక్షలు, హన్మాపూర్ పీడబ్ల్యూఎక్స్ రోడ్డు నుంచి సంకిరెడ్డిపల్లి వయా జయరాం తండా రోడ్డు కు రూ.2కోట్లు, అప్రోచ్ రోడ్డు నుంచి ఇందోల్ వరకు రోడ్డుకు రూ.35లక్షలు, గిర్మాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి చింతామణిపట్నం వయా గిర్మాపూర్ తండా రూ.83.50లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఖానాపూర్ వరకు రూ.67లక్షలు, యాలాల మండలం యాలాల పిడబ్ల్యూడి రోడ్డు నుంచి వయా విశ్వనాథ్‌పూర్ మీదుగా కమల్‌పూర్ వరకు రూ. కోటి75లక్షలు, పిడబ్ల్యూడి రోడ్డు నుండి కమల్‌పూర్ వరకు రూ.21లక్షలు, పీడబ్ల్యూడీ నుంచి తిమ్మాయిపల్లి వరకు రూ.32లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి నాగసముందర్ వరకు రూ.71లక్షలు, బషీరాబాద్ మండలం బషీరాబాద్ నుంచి దామర్‌చేడ్ మీదుగా కొత్లాపూర్ రోడ్డుకు రూ.3కోట్ల 25లక్షలు, మైల్వార్ నుంచి కంసాన్‌పల్లి(బి) రోడ్డుకు రూ.50లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మంతన్‌గౌడ్ రోడ్డుకు రూ.58లక్షలు కేటాయించారు.



ఖానాపూర్ రోడ్డు

ఏడాదిలో రోడ్లన్నీ పూర్తి చేస్తాం



నియోజకవర్గానికి అనుసంధానంగా ఉన్న రోడ్లన్నింటినీ ఏడాదిలో పూర్తిచేస్తాం. గ్రామీణ రోడ్లను ఉపాధి హామీ కింద నిధులు కేటాయించి రహదారులన్నింటినీ బాగు చేయిస్తాం. ఏ ఒక్క ఊరికీ రోడ్డు బాగా లేదనే పరిస్థితి లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ సహకారంతో ప్రతీపల్లెకు రోడ్డు వేయిస్తా. సీఎం ప్రత్యేక గ్రాంటును విడుదల చేయించారు.

- బి.మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు లేకుండా చూడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంతయ్య

మూడుచింతలపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగకుండా అధికారులు చూడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య కోరారు. క్యాసారంలో మంగళవారం నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కాలయాపన చేస్తున్నదన్నారు. గ్రామ సభల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు తగిన న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తప్పెట్ల రాములు, తోటపల్లి శంకర్, మహాలక్ష్మి, నరేంద్రచారి, నీలిమ, వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు పూడ్చివేతలపై అధికారుల సీరియస్

అక్రమార్కులపై క్రిమినల్ కేసులు



చెరువు కట్ట తూములు మూసి వేస్తున్న కూలీలు

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పెద్ద చెరువును పూడ్చేప్రయత్నం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. అదేవిధంగా చెరువు నీరు ఖాళీ చేయటానికి అక్రమంగా ఎత్తేసిన తూములను తిరిగి అధికారులు మూయించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో చెరువు పట్ల వస్తున్న వరుస కథనాలపై స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మంగళవారం చెరువు పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. కాగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ సమీపంలోని పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో కొందరు మట్టి డంపింగ్‌చేసి చెరువును పూడుస్తున్నారని అధికారులు గుర్తించారు. దీంతో పక్కనే ఉన్న వెంచర్ యజమానులను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంప్రదించగా చెరువు పూడ్చి వేతతో తమకు సంబంధం లేదని చెప్పటంతో ఇరిగేషన్ అధికారులు పంచనామా చేసి పూర్తి నివేదికను స్థానిక తహసీల్దార్ శైలజకు సమర్పించారు. దీంతో చెరువు పరిసరాల్లో మట్టి డంపింగ్ చేసి చెరువును పూడ్చే ప్రయత్నం చేస్తున్న వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలంటూ తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. చెరువును పూడ్చే ప్రయత్నం చేస్తున్న విషయం స్పష్టంగా అర్థమవుతుందని, చెరువు పరిసరాల్లో ఉన్న రియల్‌ఎస్టేట్ వెంచర్ వారు ఇలాంటి చర్యలకు పాల్పడితే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దార్ శైలజ హెచ్చరించారు.

ఎత్తేసిన చెరువు తూముల మూసివేత

చెరువులో నీటిని ఖాళీ చేయడానికి నెలరోజులుగా చెరువు తూములను ఎత్తేసిన వారిపట్ల ఇరిగేషన్ ఏఈఈ పి.నిఖిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎత్తేసిన తూములను దగ్గరుండి మూయించి నీరు చెరువు నుంచి బయటికి రాకుండా చేశారు. చెరువు నుంచి వృథాగా వస్తున్న నీటి కాలువల తూముల వద్ద ఇసుక, కంకర వేసి తూములు ఎత్తేయకుండా చర్యలు తీసుకున్నారు. ఎవరైనా తూముల ద్వారా నీటిని విడుదల చేస్తే వారిపై క్రిమినల్ కేసు పెడుతామని ఏఈఈ నిఖిత హెచ్చరించారు. చెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టే వారిపట్ల కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పెద్దచెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను ఎవరైనా తొలగించినా, చెరువు పరిసరాల్లో అక్రమంగా తవ్వకాలు జరిపినా, నిర్మాణాలు చేపట్టినా వారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఇకపై తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు చెరువు పరిసరాలపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

30ఏళ్ల ఉద్యమానికి న్యాయం దక్కింది



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఘట్‌కేసర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన 30ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం దక్కిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని శివాస్ ఫంక్షన్‌హాల్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు-వేల గొంతుల మేడ్చల్ జిల్లా సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి తమ ఆవేదనను సమాజానికి చాటడానికే వర్గీకరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు వివరించారు. ఫిబ్రవరి 7 ప్రతీ మాదిగబిడ్డ చంకన డప్పుతో నగరానికి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అశోక్ మాదిగ, ఏపూరి సోమన్న, చిరంజీవి, శివ, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాగేష్, శివ, వేణు, నరేందర్ పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ, గద్దర్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్ గౌడ్‌లు అన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి పిలుపు మేరకు మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

అక్రమంగా మొరం తవ్వకాలు

ఎక్స్‌కవేటర్, 5ట్రాక్టర్ల సీజ్



ఇందర్‌చెడ్ మార్గం పక్కన మొరం తవ్వకాలు

బషీరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా కొందరు మొరం తరలిస్తున్నారనే సమాచారంతో బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్ సీరియస్‌గా స్పందించారు. ఈక్రమంలో మొరం తవ్వకాల వద్దకు వెళ్లి ఎక్స్‌కవేటర్, ఐదు ట్రాక్టర్లను మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని సీజ్‌చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు అనుమతి పేరిట ఇందర్‌చెడ్ మార్గం వద్ద గల మొరం క్వారీ నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో మొరం తరలిస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. వెంటనే తహసీల్దార్ మొరం క్వారీ వద్దకు చేరుకుని అక్కడున్న వారిని విచారించారు. అప్పటికే ప్రభుత్వ రోడ్డు పనుల కోసం 200ట్రాక్టర్ల మొరం కోసం నవాంద్గీ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ రెవెన్యూ కార్యాలయంలో తీసుకున్న అనుమతి జిరాక్స్ పత్రాన్ని అక్కడున్న కొందరు తహసీల్దార్‌కు చూపిస్తూ తప్పుదోవ పట్టించారు. మొరం వేరొకచోటుకు తరలిస్తుండటంపై ఆరాతీసిన తహసీల్దార్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 టిప్పుల మొరం కోసం రూ. 12 వేలు డిడి కట్టి కార్యాలయంలో ఇచ్చామని మైనార్టీ నాయకుడు ఖాలేద్ చెప్పుకొచ్చారు. అనుతివ్వకున్న ఎలా మొరం తరలిస్తారని తహసీల్దార్ ప్రశ్నించడంతో నీళ్ల నమిలారు. ఇతరులకిచ్చిన అనుమతి పత్రంతో ట్రాక్టర్లలో మొరం తరలించినట్లు తహసీల్దార్ నిర్ధారణకు వచ్చారు. వెంటనే అక్కడున్న ఎస్కావేటర్, ట్రాక్టర్లను సీజ్ చేసి కార్యాలయానికి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. మొరం తరలిస్తూ పట్టుబడిన ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున రూ.25వేలు, ఎస్కవేటర్‌కు రూ.25వేలు జరిమానా విధిస్తున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

టూరిజం హబ్‌గా వికారాబాద్

(5వ పేజీ తరువాయి)

సీఎం అరగంటపాటు గడిపారు. కార్యక్రమంలో భాగంగా పెండ్యాల లక్ష్మీప్రియ(చైతన్య) ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. సీఎం మాట్లాడుతూ వికారాబాద్ ప్రాంత ప్రాధాన్యతను వివరించారు. నల్లగొండకు చెందిన బచ్చర్ల సత్యనారాయణ ఫ్లోరైడ్‌పై పోరాటం సాగిస్తున్నాడు. ఈయనకు రామ్‌దేవ్ రూ. 50 వేలు పారితోషకాన్ని అందించాడు. అలాగే వనజీవి రామయ్య-జానమ్మ దంపతులకు రూ.50 వేల చెక్కును సీఎం చేతుల మీదుగా అందించారు. ఎక్స్‌పీరియం పార్కు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పార్కు నిర్మాణంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంతో ఓపిక, పట్టుదల, కృషి, కళా పోషణ ఉంటేనే ఇలాంటి అరుదైన పార్కును ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, పార్కు రామ్‌దేవ్‌ను అభినందించారు.

ప్రత్యేక ఆకర్షణగా వనజీవి రామయ్య

వనజీవి, పద్మశ్రీ అవార్డు గ్రహీత రామయ్యతోపాటుగా ఆయన భార్య జానమ్మ పార్కు ప్రారంభోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి వనజీవి రామయ్యతో పాటుగా ఆయన భార్య జానమ్మను శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఖమ్మం జిల్లాలోని ఓసాధారణ రైతు కుటుంబంలో పుట్టిన రామయ్య దంపతులు ఎంతో శ్రమకోర్చి మొక్క మొక్క నాటుతూ సంవత్సరాల తరబడి కష్టించారని సీఎం గుర్తు చేశారు. వారి శ్రమ ఫలితంగా అడవి సృష్టి జరిగిందని, వారి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎంపీలు సీఎం రమేశ్, అనిల్ యాదవ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సినిమా రచయిత విజేంద్రప్రసాద్, జిల్లా మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, మొయినాబాద్ మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్, ప్రముఖ యాంకర్ సుమ, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, మాణెయ్య జనార్దన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అనంతగిరి.. పర్యాటక సిరి

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి పనులు చేపట్టాలని, ఆ తర్వాత రెండు, మూడు దశల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ పనులు చేపట్టేందుకు అనంతగిరిలో అనంతపద్మనాభస్వామి ఆలయం వెనుక వ్యూ పాయింట్ పరిసరాల్లో ఇప్పటికే అధికారులు సర్వే పూర్తి చేశారు.

మొదటి విడతలో మౌలిక వసతుల కల్పన

ఈ ప్రాంతంలో మొదట విడతగా అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నారు. అంతర్గత రోడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, సీవరేజ్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. పర్యాటకుల కోసం టెంట్లు ఏర్పాటు వంటి సదుపాయాలు కల్పిస్తారు. అటవీ ప్రాంతంలోని చెట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోనున్నారు. అటవీ, పర్యాటక శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లనున్నారు. ఇప్పటికే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి అధికారులు ఎకో టూరిజంపై సమీక్ష నిర్వహించారు. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకున్నారు.

'దావోస్' ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

అనంతగిరిని ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెయ్యి కోట్లు పెట్టుబడులు పెట్టేవిధంగా ఓ సంస్థతో ఒప్పందం చేసుకోవడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతగిరిలో ప్రపంచ స్థాయి లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇటీవల ఈ విషయమై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటన చేయడంతో అనంతగిరి పర్యాటకాభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. అనంతగిరిని ఎకో టూరిజంగానే అభివృద్ధి పరచడమే కాకుండా వెల్‌నెస్, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి పరిచేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అనంతగిరిలో ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయం ఉన్న విషయం తెలిసిందే.



అనంతగిరిలో పర్యాటకాభివృద్ధి సంస్థ సర్వే నిర్వహించిన ప్రాంతం

సర్వే పూర్తయింది



అనంతగిరిలో ఎకో టూరిజంగా అభివృద్ధి చేసే ప్రాంతంలో ఇప్పటికే సర్వే పూర్తయింది. ఇప్పటివరకు ఎకో టూరిజం కోసం 18 ఎకరాలు కేటాయించాం. పర్యాటకాభివృద్ధి కోసం మొత్తం 217 ఎకరాలను గుర్తించాం. టెండర్ ప్రక్రియ పూర్తయింది. పర్యాటకాభివృద్ధి పనులతో అటవీ ప్రాంతంలోని చెట్లకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



చేవెళ్ల పట్టణ కేంద్రంలో రిలే దీక్ష చేపట్టిన మల్లారెడ్డి

చేవెళ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాయతీ రహదారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి చేవెళ్ల పట్టణ కేంద్రంలో మంగళవారం రిలే దీక్షకు పూనుకున్నాడు. షాబాద్ మండల పరిధిలోని పోతుగల్‌కు చెందిన మల్లారెడ్డి (శివమాలధరణ వేశాడు) సామాజిక కార్యకర్త. అయితే, చేవెళ్ల పట్టణ కేంద్రం మీదుగా వెళ్లే హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు పోలీస్ అకాడమీ నుంచి వికారాబాద్ జిల్లా మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని కోరాడు. ఈమేరకు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని షాబాద్ చౌరస్తా వద్ద రిలే దీక్ష చేపట్టాడు. రిలే దీక్ష కొరకు చేవెళ్ల పోలీసుల నుంచి ఇటీవల అనుమతి కూడా తీసుకున్నాడు. గతంలో కూడా షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని మల్లారెడ్డి పోరాటం చేశాడు. దీక్ష చేపట్టిన మల్లారెడ్డికి చేవెళ్లలోని వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపేందుకు సిద్ధం అవుతున్నారు.

బొంతపల్లి కుంటలో మట్టి తొలగింపు



జేసీబీతో మట్టిని తొలగింపజేస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ సమీపంలోని బొంతపల్లి కుంట ఎఫ్‌టీఎల్‌లో మట్టిపోసి పూడ్చడంపై ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తున్నట్లు ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. ఆక్రమణలో బొంతపల్లికుంట అనే శీర్షికన ఈనెల 26 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఇక్కడ సర్వేనెం. 231, 232లలో మునీర్ అనే వ్యక్తి బొంతపల్లి కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో రాత్రికిరాత్రే టిప్పర్ల ద్వారా మట్టిపోసి చదును చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ ఏఈ హరితారెడ్డి చెప్పారు. ఈ కుంట ఎఫ్‌టీఎల్ 20 ఎకరాలుండగా కొందరు దీనిని పూడ్చి వ్యాపారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓవైపు చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రా ప్రత్యక్ష చర్యలకు దిగుతున్నా.. ఇక్కడ కొందరు కుంటను పూడ్చేందుకు పూనుకోవడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

బషీరాబాద్ మండలానికి మహర్దశ

బషీరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కృషితో మండలానికి మహర్దశ పట్టనుందని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అన్నారు. బషీరాబాద్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెనకబడిన మండలానికి ఏడాది కాలంలోనే ఎమ్మెల్యే రూ.300కోట్ల నిధులు మంజూరు చేయించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మీనారాయణపూర్ జాతీయ రహదారి నుంచి బషీరాబాద్ మీదుగా మైల్వార్ వరకు నాలుగులైన్ల రోడ్డుకు రూ.150కోట్లు, బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు బీటీ రోడ్డుకు రూ.30కోట్లు, ఉపాధిహామీ పథకం కింద వివిధ అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు, బషీరాబాద్‌లో సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి రూ.10కోట్లు, నవాంద్గీ నుంచి కర్ణాటక హక్కోడ, పీఆర్ రోడ్డు నుంచి శివాలయం, మంతట్టి రోడ్డు రూ.10కోట్ల నిధులు వచ్చాయన్నారు. తాజాగా బషీరాబాద్- దామర్‌చెడ్ మీదుగా కొత్లాపూర్ వరకు బీటీరోడ్ల అభివృద్ధికి రూ.3.25కోట్లు, మైల్వార్-కంసాన్‌పల్లి(బి)వరకు రూ.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మంతన్‌గౌడ్ వరకు రూ.58 లక్షల నిధులు మంజూరైనట్లు వివరించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

మర్పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని ఎక్సైజ్ సీఐ సహదేవుడు అన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం మత్తుపదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రేణుక, ప్రిన్సిపాల్ ప్రమీల పాల్గొన్నారు.

పరిగి బల్దియా విస్తరణ

- ఆరు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- 15 నుంచి 18కి పెరిగిన వార్డులు



పరిగి మునిసిపల్ కార్యాలయం

పరిగి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పరిగి పురపాలక సంఘం విస్తరించింది. పరిగి మునిసిపాలిటిలో ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ)డాక్టర్ టీకే శ్రీదేవి ఐఏఎస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విలీనమైన ఆరు పంచాయతీలు బుధవారం నుంచే మునిసిపల్ పాలనలోకి రానున్నాయి.పరిగి మున్సిపాలిటీలోకి ఆరు గ్రామాలు సుల్తాన్‌పూర్, సయ్యద్‌మల్కాపూర్, రుకుంపల్లి, నస్కల్, నజీరాబాద్,శాఖాపూర్ గ్రామాలు మునిసిపల్‌లో విలీనమయ్యాయి. ఇప్పటి వరకు 15 వార్డులు ఉండగా 18కి పెరిగాయి. ఆరు పంచాయితీలకు సంబంధించి ప్రొఫైల్, రికార్డులు స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులో సూచించారు. మునిసిపల్‌లో విలీనమైన ఆరు గ్రామాల ప్రొఫైల్, పంచాయితీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వివరాలు, పంచాయతీలకు చెందిన స్థిర, చరాస్తులు, డిపాజిట్లు, పెట్టుబడులు, పన్నుల వివరాలు, బ్యాంకుఖాతాల వివరాలు, గ్రామాల్లో అమలవుతున్న పథకాలు, పనులు,సామగ్రి, బిల్లుల వివరాలు, మూడేళ్లకు సంబంధించి లేఅవుట్లు, పంచాయితీ భవనాల వివరాలు సేకరించి పంపించాలని మునిసిపల్ శాఖ ఆదేశించింది. బుధవారమే అట్టి వివరాలు అధికారులు ప్రభుత్వానికి అందజేయనున్నారు.

పరిగి మునిసిపాలిటీ గురించి..

గతంలో పంచాయతీగా ఉన్న పరిగి 2018 ఆగస్టు 2న మున్సిపాలిటీగా ఏర్పడింది. పరిగి మునిసిపాలిటీ 15 వార్డుల విభజనతో 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి, ఈ జనవరి 26తో పాలకవర్గం గడువు ముగిసింది. ప్రస్తుతం పరిగి మునిసిపాలిటీ పరిధిలో 15వార్డులు 5,132 కుటుంబాలు ఉన్నాయి. 2011 లెక్కల ప్రకారం 18,241మంది జనాభా ఉంది. ప్రస్తుతం అంచనా మేరకు 35వేల వరకు జనాభా ఉంటుంది. తాజాగా పరిగిలో 18,541మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 10,312 పురుషులు, 10,053 మంది మహిళా ఓటర్లు ఉంటారు. ఆరు గ్రామాల విలీనంతో ఓటర్ల సంఖ్య భారీగా పెరుగనుంది. కొత్తగా 6650మంది ఓటర్లు మునిసిఫల్ పరిధిలోకి వచ్చేశారు. అంటే మునిసిపల్ ఓటర్ల సంఖ్య 25,191కు చేరింది. విలీన గ్రామాలతో పరిగి మునిసిపల్ పరిధిలో 15 నుంచి 18 వార్డులకు పెరిగింది.

విలీనమైన గ్రామాలు

పరిగి మున్సిపాలిటీకి ఐదు కిలోమీటర్ల పరిధిలోని ఉన్న ఆరు గ్రామాలైన నస్కల్‌లో 964 కుటుంబాలు ఉండగా, 2606మంది ఓటర్లు ఉన్నారు. నజీరాబాద్‌లో 388కుటుంబాలకు గాను, 1035ఓటర్లు, సయ్యద్‌మల్కాపూర్‌లో 327 కుటుంబాలకు గానూ 830 ఓటర్లు, రుకుంపల్లిలో 198 కుటుంబాలకు గానూ 573ఓటర్లు ఉన్నారు. శాఖపూర్‌లో నివాసాలు ఏమీ లేవు. ఈ గ్రామ పరిధిలో భూములు మాత్రమే ఉన్నాయి.

క్రైం కార్నర్

లగచర్ల నిందితుడు సురేశ్‌రాజ్ విడుదల

కొడంగల్/దుద్యాల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో గత నవంబరు 11న జిల్లా కలెక్టర్ ఇతర అధికారులపై జరిగిన దాడి సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో ఏ2గా నిందితుడిగా ఉన్న బోగమోని సురేశ్‌రాజ్ మంగళవారం రాత్రి జైలు నుంచి విడుదలయ్యాడు. నిందితుడు సురేశ్‌రాజ్ దాడి జరిగిన తర్వాత కొన్ని రోజుల పాటు పరారీలో ఉండి నవంబరు 19న కొడంగల్ కోర్టులో లొంగిపోయాడు. ఆ తర్వాత పోలీసులు కస్టడీలోకి తీసుకొని సురేశ్‌రాజ్‌ను విచారించారు. 71రోజుల పాటు జైలులో ఉన్న సురేశ్‌రాజ్‌కు మంగళవారం హైకోర్టు ఇచ్చిన బెయిల్‌తో విడుదలయ్యాడు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామశివారులో గల జేబీ హోమ్ డెయిరీ ఫామ్ సమీపంలో గుర్తుతెలియని సుమారు 60ఏళ్ల వృద్ధుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు ముస్లిం కమ్యూనిటీకి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఎరుపు రంగు షర్టు, బ్లూ ప్యాంటు ధరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు

మోమిన్‌పేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్ఐ అరవింద్ హెచ్చరించారు. మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పలువురు పట్టుబడ్డారని తెలిపారు. మేకవనంపల్లి గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు, కేసారం గ్రామానికి చెందిన గుజ్జరి అరుణ్‌కుమార్, బర్వాద్ గ్రామానికి చెందిన బంటారపు కుమార్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పర్చినట్లు తెలిపారు. కోర్టు మెజిస్ట్రేట్ ఇంచార్జ్ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ఒక రోజు సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పోస్టాఫీస్‌లో డబ్బులు దుర్వినియోగం

- నిందితుడికి రెండేళ్ల జైలు

కొడంగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోస్టాఫీస్‌లో పదేళ్ల కిందట జరిగిన డబ్బులు దుర్వినియోగం కేసులో నిందితుడికి రెండేళ్ల శిక్ష పడినట్లు ఎస్ఐ జీవీ.సత్యనారాయణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రజలు తమ ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ కోసం 23.07.2014 నుంచి 24.07.2014 వరకు రెండు రోజులు బ్రాంచీ ఆఫీస్ అకౌంట్ పేమెంట్స్ రాకపోవడంతో డబ్బుల విషయం గురించి పోస్టమేల్ సర్వీసెస్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పోస్టుమేల్ సర్వీసెస్ రాములు, బుచ్చయ్యతో కలిసి కొడంగల్‌లోని బాలాజీనగర్ బ్రాంచీలో తనిఖీచేయగా అందులో రూ.74,340కు సంబంధించి ఎలాంటి లావాదేవీలు లేవని గుర్తించారు. ఈ విషయం గురించి బీపీఎం గోపాలకృష్ణ సొంత ఖర్చుల కోసం వాడుకున్నాడని తెలియడంతో డబ్బుల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్‌లను సీజ్‌చేసి విచారణ చేపట్టగా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు గోపాలకృష్ణపై కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. మంగళవారం నేరాభియోగపత్రాలను కొడంగల్ ఎస్ఐ జీవీ.సత్యనారాయణ కోర్టులో దాఖలు చేయగా నిందితుడు గోపాలకృష్ణకు న్యాయమూర్తి శ్రీరామ్ రెండేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బొంరాస్‌పేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవనూర్ నుంచి వడిచర్లకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం ఉదయం ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ట్రాక్టర్ డ్రైవర్ కం యజమాని ఖాసీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


శామీర్‌పేట: శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శామీర్‌పేట, జనవరి28 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శామీర్‌పేటలోని శ్రీభవానీరామలింగేశ్వర స్వామి ఆలయం(శివాలయం)లో సోమవారం రాత్రి మాసశివరాత్రి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో వేదబ్రహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. శామీర్‌పేటకు చెందిన భజన మండలి బృంధం ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం భక్తుల సహకారంతో అన్నదానం చేశారు. అదేవిధంగా మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కీసర మండలం బండ్లగూడకు చెందిన సందని హరికృష్ణ, వారి కుటుంబసభ్యులు, ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లం పేట గౌరారం జగన్‌గౌడ్, పార్టీ నాయకులు మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాగర్‌గౌడ్, మల్లేశ్ ముదిరాజ్, రాఘవరెడ్డి, మహేశ్, గోపాల్, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తాం

కీసర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కీసరగుట్టపై జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామని ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ అన్నారు. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆలయ మహా మండపంలో చైర్మన్ నారాయణ శర్మ ఆవిష్కరించారు. లక్షలాది మంది భక్తులు విచ్చేసే బ్రహ్మోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. బ్రహ్మోత్సవాలపై త్వరలో కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరుగుతుందని, ఆనంతరం ఏర్పాట్లపై శాఖల పరంగా ఏర్పాట్లు చేస్తామని చైర్మన్ నారాయణ శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

తాండూరు రూరల్, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ శాఖ మండల అధ్యక్షుడు జొన్నల వినోద్‌కుమార్, మండల పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన యూపీఎస్(యూనిఫైడ్ పెన్షన్ స్కీం) గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల పీఆర్టీయూ శాఖ మండల అధ్యక్షుడు జొన్నల వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పీఆర్టీయూ డైరీని ఆవిష్కరించి ఎంఈవో వెంకటయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పత్రిక సంపాదకుడు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీజీసీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్ అన్నారు. కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం కరపత్రాలను విడుదల చేశారు.

దోమ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆర్.కేశవులు అన్నారు. మండల కేంద్రంలో పీఆర్‌టీయూ నాయకులతో కలిసి మంగళవారం తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌సింగ్, వేణుగోపాల్, వెంకట్రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ మాజీ పాలకవర్గానికి ఎమ్మెల్యే సన్మానం

ఘట్‌కేసర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాజీ పాలకవర్గ సభ్యులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాజీ ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, కొమ్మగోని రమాదేవి, హేమలత, అనురాధ, ఆంజనేయులు, వసంత, నర్సింగరావు, షౌకత్ మియా, అరుణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మమతా జగన్‌మోహన్‌రెడ్డి సేవలు అభినందనీయం

ఘట్‌కేసర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ 18వ వార్డు మాజీ కౌన్సిలర్ బద్దం మమతాజగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి మరువలేనిదని పోచారం ప్రజలు అన్నారు. మంగళవారం పోచారంలోని ఆమె నివాసానికి పెద్దఎత్తున చేరుకున్న జనాలు మమతాజగన్‌మోహన్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కోట్ల రూపాయల సొంత ఖర్చులతో ఆలయాలు, రోడ్లు, పేదల కోసం మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయ్‌పాల్‌రెడ్డి, సత్యనారాయణ, మహేష్ గౌడ్, మదుసుధన్ రెడ్డి, ఎస్‌కే చారి, బాల్‌రాజ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఘట్‌కేసర్. జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి అన్నారు. ఆయన మంగళవారం నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు శోభన, మున్సిపల్ మేనేజర్ అంజన్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి

మూడుచింతలపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని, ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కళాశాల చైర్మన్ కామిడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కామిడి వీరారెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా కామిడి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎస్ఎల్ఎంఎస్ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలోని వీరారెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిబిరంలో 41 మంది రక్తదానం చేయగా, 175 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాం రవి, వంగ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగరాజ్, మాజీ వార్డు సభ్యులు రాజేంద్రప్రసాద్, మురళీగౌడ్, నర్సింహులు, వైద్యులు సర్వరాజ్‌ఖాన్, దివ్యరెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయ్‌కుమార్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయ్‌కుమార్ తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం రెండురోజుల పాటు జరిగిన అంతర్జాతీయ ఐసీఐఎఫ్ఎంఈడీఈ-2025 సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ సదస్సులో విద్యార్థులు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రెసిడెంట్ అనురాగ్ పల్లా, డీన్లు విష్ణుమూర్తి, శ్రీనివాస్, సికిందర్‌బాబా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలి


కీసర గురుకుల పాఠశాలలో వంటశాలను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

కీసర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా అన్నారు. కీసరలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి ఆమె మంగళవారం రాత్రి సందర్శించారు. ముందుగా విద్యార్థినులతో పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. అనంతరం తరగతి గదులను, భోజనశాల, వంటశాలలను, పిల్లలు నిద్రించే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించేలా చూడాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రఘునందన్, పాఠశాల హెచ్ఎం మహాలక్ష్మి పాల్గొన్నారు.

దుద్యాల మండల పరిషత్ కార్యాలయానికి భవనం పరిశీలన

దుద్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు పనులను వేగవంతం చేశారు. మండల కేంద్రంలోని దళిత వాడ ప్రాథమిక పాఠశాల భవనంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటుకు ఎంపీడీవో వెంకన్‌గౌడ్ పరిశీలించారు. గత నెల డిసెంబరు 26న మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర రూ.8కోట్ల 80లక్షల వ్యయంతో మండల ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. వీటి నిర్మాణం పూర్తయ్యే వరకు మండల పరిషత్ కార్యాలయాన్ని తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనాన్ని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, వెంకటయ్య, ఖాజమీయ, సత్యం పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి ప్రత్యేక నిధులు


జీవన్గిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాధవరెడ్డి

బషీరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మధవరెడ్డి తెలిపారు. మండలంలోని జీవన్గిలో రూ.15లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మాణిక్‌రెడ్డి, నాయకులు సంగారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని చంద్రశేఖర్‌కాలనీలో రూ.40లక్షలతో మంగళవారం ఏఎంసీ చైర్మన్ ఎల్లనోళ్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్‌గౌడ్, ఏరాజ్‌పాష, షఫీ, ప్రభాకర్, నరేశ్, అరుణ్, షానవాజ్, బల్వంత్, బండయ్య, కృష్ణ, సంగమేశ్, శ్యామ్, నరేశ్, చందు పాల్గొన్నారు.

వికారాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో గొట్టిముక్ల గ్రామాన్నిఅభివృద్ధి చేస్తున్నట్లు గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూకంటి సహదేవ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.20లక్షల నిధులతో గ్రామంలో అవసరమైన చోట సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తాండూరు రూరల్, జనవరి 28, (ఆంధ్రజ్యోతి) : తాండూరు ప్రాంతానికి చెందిన ఎం.రవికుమార్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్యం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ.2లక్షలా 50వేల ఎల్‌వోసీని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగప్ప పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలోని చిన్నమేగ్యానాయక్ తండాలో లాలమ్మకు మంజూరైన రూ.58వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్చాటి అశోక్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, సలీమ్, వెంకటయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ సంఘం నూతన కమిటీ

దుద్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ సంఘం దుద్యాల మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాదవ సంఘం సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా నర్సింహులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య యాదవ్, కోశాధికారిగా ఎన్.హన్మంతుయాదవ్, ఉపాధ్యక్షుడిగా నర్సింహులుయాదవ్, ప్రభాకర్ యాదవ్, వెంకటేశ్‌యాదవ్, అనంతయ్యయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా అంజిలయ్యయాదవ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమలో ఆంజనేయులు, పి.రాఘవేందర్‌యాదవ్, పకీరప్ప, బస్వరాజ్‌యాదవ్, యాదగిరి పటేల్, వెంకటేశ్ యాదవ్, నర్సింహులు యాదవ్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ సేవలను కొనియాడిన కాలనీవాసులు

పరిగి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిపాలిటీ పరిధిలోని నాల్గవ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన వారాల రవీంద్ర ఐదేళ్లలో అందించిన సేవలను ప్రశంసించారు. నాల్గవ వార్డు పరిధిలోని టీచర్స్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మందులకాలనీ, అయ్యప్పకాలనీల కమిటీలు, శ్రీరామసేతు యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కౌన్సిలర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన రవీంద్రకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రవీంద్ర చేసిన అభివృద్ధి, సేవలను గుర్తుచేసుకోవాలని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ

దోమ: మండలంలోని గుండాల్ లో మంగళవారం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పోతిరెడ్డిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా సి.దస్తయ్య, యం.కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు బండెయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దోమ: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం దోమ మండల అధ్యక్షుడు సూర్యానాయక్ ఆధ్వర్యంలో మంగళవారం దోమ జడ్పీహెచ్ఎస్‌లో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎంఈవో వెంకట్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్, లాల్యానాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి ఎంపీ పరామర్శ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఘట్‌కేసర్ మండల మాజీ అధ్యక్షుడు చలువది ప్రవీణ్‌రావు సోదరుడు చలువది గోపాల్‌రావు రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. మంగళవారం వారి స్వగ్రామమైన అకుషాపూర్‌లో నిర్వహించిన అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎంపీ ఈటల రాజేందర్ గోపాల్ మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుందర్శన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మోమిన్‌పేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు పుండరీకం అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మోమిన్‌పేట్‌లో ఆటో డ్రైవర్‌లు, ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బలరాం, శ్రీశైలం, మల్లేశం పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారం'

ఘట్‌కేసర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఘట్‌కేసర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేష్ కార్యకర్తలకు సూచించారు. ఆయన మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి అన్నోజిగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం ఏపథకం తీసుకున్న అది ప్రజలకు చేరేది కాదన్నారు. నేడు సాగుభూములకు, అసలైన రైతులకు రైతు భరోసాను అందిస్తున్నట్లు వివరించారు. ఇది జీర్ణించుకోలేని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో రైతు రుణమాఫీ ఐదేళ్లపాటు చేస్తే ఆది వడ్డీకే సరిపోయిందన్నారు. పదేళ్లల్లో జిల్లాకు 10చొప్పున రేషన్ కార్డులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల అసలు రంగును జనంలో బయటపెట్టిందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కదలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.బోజిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాదవిరాజు, పద్మ, లక్ష్మి, జాఫర్ హుస్సేన్, జ్ఞానేశ్వర్, మహేందర్, వినోద్‌కుమార్, సహదేవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌కు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మర్పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రూ.20 లక్షలతో మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లి గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ మంజూరైందని, భవనాన్ని నిర్మించేందుకు గ్రామంలో అనువైన స్థలం కోసం తహసీల్దార్ మునిరోద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని క్రీడా ప్రాంగణం సమీపంలో సబ్‌సెంటర్ ఏర్పాటుతో ప్రజలకు దోహదపడుతుందన్నారు. దామస్తాపూర్, దామస్తాపూర్ తండా, గుర్రంగట్టు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్ పాల్గొన్నారు.